కథానిక

# జీవితం నేర్పిన పాఠం

వడ్లపట్ల దయానందం

కాటూరి వారబ్బాయికీ - వేటూరి వారమ్మాయికీ మధ్య సూజాయిగా ప్రేమ పుట్టింది. పుట్టింది నానాపూ ఆరు మాసాల వఱకూ నేవళంగా నవనవలాడుతూ పెరిగింది. పెరుగుదల్లో 'కాటూరి వారబ్బాయి' హృదయానిదే పైచేయి

వేటూరి వారమ్మాయి హృదయంలో ప్రేమ ఉన్నా, కట్టుదిట్టంగా మొగ్గయినా తొడగలేదు. కాటూరి వారబ్బాయి హృదయంలో మట్టుకు మొగ్గ తొడుగేయడం విడి పూసేయడం పిందె వేసేయడం, కాయకాసి పండిపోవడం కూడా జరిగిపోయింది.

అందుకే కాటూరి వారబ్బాయిది ఆముదం తాగిన ముఖంగాను వేటూరు వారమ్మాయిది నిద్రలేచిన ముఖంగానూ తయారైనాయ్. వేటూరు వారమ్మాయి హృదయంలో మొలచిన ప్రేమ మొక్కకి, పోషక పదార్థాలెలా అందజేయాలా, అన్న విషయంమీద ఇదమిత్థమని తేల్చుకోలేని పరిస్థితిలో కాటూరివారబ్బాయి ఉంటూండగా—

కాలేజీ కాంపౌండుకు దరినే ఉన్న కాలవగట్టు మెట్టమీది మామిడితోటలో ఓనాటి మిట్ట మధ్యాహ్నపు శుభసమయాన...

"నా మనసంతా 'ఏదో'గా ఉంద"న్నాడు కాటూరి వారబ్బాయి, లంఖణాలు చేసినవాడిలా ముఖంపెట్టి.

"ఎందుకూ?" మరే అరమరికా లేకుండా, తిన్నగా అడిగేసింది వేటూరివారమ్మాయి.

"ఎందుకూ?" అన్నదానికి సమాధానంగా, 'ఇదీ' అని, 'ఏది' చెప్పాలో తెలియక, ఇరవై రెండు సంవత్సరాల పసిబాలుడై సిగ్గుపడిపోయి, సిగరెట్టు ముట్టించాడు కాటూరివారబ్బాయి.

"ఇవి కాల్చందే ఉండలేవా" వేటూరివారమ్మాయి సున్నిత హృదయంలోంచి మృదువైన పెదవులమధ్య మెదలిన ఈ మాటలకి, కాటూరి వారబ్బాయి "తుఫాను హృదయం" శాంతించి నట్లై, ముసిముసిగా నవ్వేసుకున్నాడు.

"ఏమిటో ఇదొక 'వెధవ'లవాటైపోయింది." పెద్దమనిషి తరహాలో హుందాగా అన్నాడు.

"షష్ఠీ తత్పురుషా?" వేటూరివారమ్మాయి వెంటనే ప్రశ్నించింది.

స్పెషలు తెలుగు పుచ్చుకున్న, కాటూరివారబ్బాయి మనస్సు పుటుక్కున చివుక్కుమంది.

"ఊహు...కాదు...కర్మధారయే" అన్నాడు విడిస్తే బావుండదని, నవ్వుతూ.

తర్వాత కాసేపాలోచించి "ఛీ...ఛీ...ఎంత ధైర్యంగా అనేసింది" అని బోలెడు కోపం హృదయంలోనే పడ్డాడు ఆటుపైన కాసేపటికి.

కాటుక వలయాలమధ్య కలువ రేకుల్లాంటి కాంతివంతమైన కళ్ళను, నల్లని ముంగురులతో దోబూచులాడుతున్న విశాలమైన ఎర్రటి నుదిటిని చూచి కోపం మరిచిపోయాడు. ఎర్రని కంఠానికి పచ్చగా చుట్టుకుపోయిన, మామిడి పిందెల నెక్లెస్ చక్కగా ఉందనుకున్నాడు. మణి కట్టున మెరుస్తున్న బుల్లి రిస్టువాచీ, ఆ సౌందర్యానికి రవ్వంత మెరుగు పెడుతోంది అనుకున్నాడు. లేత గులాబీ రంగు జార్జెట్ చీరకి, ఆ పసుపు పచ్చని జాకెట్ ముచ్చటగా సూటైందనుకున్నాడు. కీకారణ్యంలా వదలివేయబడ్డ దుబ్బు జడల చివళ్ళు ముద్దుగా ఉన్నాయనుకున్నాడు. ఎర్రటి ఎత్తు మడమల బూట్లు వికారంగా ఉన్నట్లనిపించినా...అవి ఆ కాళ్ళకుండటంవల్ల ఆలా అనుకోలేకపోయాడు.

ఇలా అనుకుంటూనే...కాలుతున్న సిగరెట్టునొక దమ్ము గట్టిగాలాగి ... హృదయాన్ని ధూమంతో ప్రక్షాళనం గావించుకుని ఆఖరికి బయటికన్నాడు:

"కనకదుర్గా!— ఎంతకాలము నీ దోబూచులాట. హృదయాల్ని విప్పుకు మాట్లాడుకుందాం" అని.

"నా హృదయాన్నెప్పుడూ మూటకట్టుకు కూర్చోలేదే భద్రయ్యా" అంది కనకదుర్గ వెంటనే.

"పోదూ...నువ్వెప్పుడూ అలానే అంటావ్. అయితే మరి నీ హృదయంలో ఉన్న మాటేమిటో ఇప్పుడనేయ్... ఆ తర్వాత నేననేస్తా" చిన్న పిల్లని బెలిపిస్తున్న ధోరణిలో అన్నాడు భద్రయ్య.

"ఊహు...ముందు నీ హృదయాన్నే విప్పి బయట పెట్ట"మంది దుర్గ.

చచ్చాంరా అనుకుని చచ్చినట్టు చెప్పేశాడు-

"నిన్ను యివ్వాల్టికి సరిగ్గా తొమ్మిది మాసాల క్రితంనాడే ప్రేమించాను దుర్గా. ఇలా కూర్చున్న పళంగా పెండ్లాడేయటానికి నాకెట్టి అభ్యంతరమూ లేదు. ఇవిగో, ఈ మామిడిచెట్లూ...అడుగో నెత్తి మీదున్న ఆ సూర్యభగవానుడు... ఈ ఎండి పోయిన పంటకాల్వ...సాక్షులు. కావాలంటే కాలేజీ కాంపౌండు గోడనికూడా సాక్షిగా వేసుకో. నీ హృదయంలో నా హృదయం ఆరు మాసాలనాడే సంపూర్ణంగా ఐక్యమైపోయింది. ఇక సహించటం... భరించటం ... అసంభవం... అసాధ్యం"—ఉద్రేకంలో గబగబా అనేశాడు.

ముందు శాంతింప చేయటానికి దరహాసంతో కూడుకున్న చిరునవ్వొకటి విసిరింది.

"హమ్మయ్య బ్రతికాం" అనుకున్నాడు దుర్గ ముఖం చూచిన భద్రయ్య.

"భద్రయ్యా నా హృదయంకూడా అంతే. కాని..." చివరి రెండక్షరాలమాటా భరించ లేనంత భారంగా, భద్రయ్య హృదయంమీదపడ్డది.

"ఇంకా...ఆ...కానీ ఏవిటీ" అన్నాడు ఆందోళనగా.

"అబ్బే, మరేంలేదు- ఒక్క ఈ హృదయాలే కాదుగా ముఖ్యం...వీటితాలూకూ దేహాలు... వాటితాలూకూ... ఆకలి దప్పులు...ఆస్థిపాస్తులు... అంతస్తులూ, గింతస్తులూ... పెద్దల అంగీకారాలూ- అవీ, ఇవీ వగైరాలుంటాయిగా!" అంది సందేహాస్పదంగా.

"నా తరఫు పర్మిషన్ ష్యూర్" అన్నాడు ఉత్సాహంగా.

"అయితే నా తరఫునా అంతే" అంది దుర్గ.

* * *

ఆ తర్వాత కొద్దిరోజులకే, అత్యవసరంగా పెండ్లి కార్యక్రమం ముగించేసుకుని అటుపైన మూడేసి పార్టులు చొప్పున ఇద్దరూ ఫేలయ్యారు పరీక్షల్లో.

భద్రయ్యనంతగా ఆ రిజల్ట్సు నిరుత్సాహ పరచలేదు. రిజల్ట్సొచ్చిన రోజునే దుర్గని చూడ్డాని కొచ్చి లేడీడాక్టరు ఆ దరిమిలాను భద్రయ్యని కూడా చూచి చిరునవ్వుతో 'భయపడకండి మరేం ప్రమాదం లేదు... మీరు తండ్రి కాబో తున్నారు" అంది.

"ఓరినీ...నిజంగా?" అనుకున్నాడు భద్రయ్య.

ఒకచెంప ఆశ్చర్యంతోనూ, మరోచెంప అనంత మయిన సంతోషంతోనూ, ఎగిరి ఒక్క గెంతు గెంతి దుర్గ మంచందగ్గర వాలాడు- రొమ్ము విరచి ఠీవిగా నిలబడ్డాడు, చూచావా నా ప్రతిజ్ఞన్నట్టు.

లేడీ డాక్టరువల్ల విషయం తెలుసుకొచ్చాడని గ్రహించిన దుర్గ—

"చాల్లే ఎవరైనా చూస్తే నవ్వగలరు... ఆ రిజల్ట్సుమాట తెలిస్తే...మావగారు" అంటూ మృదువుగా చిరునవ్వుతో చీవాట్లు పెట్టింది.

"అందుకే నా సంగతి నిజం చెప్పొద్దన్నానుగా. నెమ్మదిమీద దానంతటదే బయట పడనియ్" అన్నాడు ప్రాధేయపడుతూ. అంతలోనే—

"ఏమిట్రా బయట పడకేయమంటూన్నావే" అంటూ మాతృమూర్తి రంగంలో ప్రవేశించింది బార్లీ నీళ్ళు చెంచాతో కలుపుతూ.

"అహఁ, మరేంలేదమ్మా! మీ కోడలు జ్వరం విషయం"అంటూ తల్లి ముందు మరీ చిన్నపిల్లవాడై పోయి,ముఖం వెనక్కి తిప్పేసుకున్నాడు భద్రయ్య.

దుర్గకి కూడా తెగసిగ్గేసి ముఖం అటు తిప్పే సుకు పడుకుంది-

"అబ్బా! ఏమిటో మీ గొడవ, ఎప్పుడూ మనసులో మాట బయటపెట్టరు"అంది తల్లి.

"అమ్మా! మరేం...మీ కోడలు తల్లి కాబో తోందమ్మా!" సిగ్గుతో గభాల్న గోడకి చెప్పే శాడు భద్రయ్య.

బార్లీనీళ్ళు త్రాగటానికి ఇటు త్రిప్పిన దుర్గ ముఖం కూడా సిగ్గుతో కందగడ్డలా ఐపోయింది.

"ఆఁ, అలాగా!" అంటూ పెద్దగా ఆశ్చర్య పోయి, గంపెడు సంతోషపడి ఆ మాట భర్త ఇంటికి రావడంతోనే అనేసింది తల్లి.

"మీరిక తాతయ్య అవతారం దాల్చబోతున్నారండీ" అని.

"ఊఁ, అలాగా! నువ్వుమట్టుకు మామ్మవు కావూ మరి?" అని సరసధోరణితో ఓ మాటనేసి, వెంటనే "వీళ్ళపరీక్షల సంగతేమైంది... ఇవ్వాళ పేపర్లలో పడ్డాయటగా!" అడిగాడు.

గదిలోఉన్న ఇద్దరూ చెవులు నిక్కించారు.

"కోడలమ్మగారు తప్పి కూర్చుంది, అబ్బాయి పాసే అయ్యాడట లెండి" అంది తల్లి సంతృప్తి కనబరుస్తూ. తండ్రీ అదే కనబరచేసరికి తాత్కాలికంగా 'హమ్మయ్య!' అనుకున్నాడు దుర్గ మంచం మీద కూర్చున్న భద్రయ్య.

• • •

"నాన్నా! అమ్మ పిలుస్తోంది" అన్నాడు ఐదు సంవత్సరాల కుర్రవెధవ చినభద్రయ్య.

పచ్చి మామిడిపుల్లలు మండక ఊదుగొట్టం సాయంతో పొగతో కుస్తీపడుతున్న పెదభద్రయ్య ఏకచేతిలో ఉన్న మసిగుడ్డతో చరున లేచి పులిలా చక్కావచ్చాడు డ్రాయింగ్ రూమ్‌లోకి.

వస్తూనే "నీకసలు బుద్ధిలే" దన్నాడు.

"నీకుంది కనుకనా"—తీస్తున్న కూనిరాగాలనాపి, ఈజీచైర్‌లో కూర్చుని మఫ్లర్లల్లుకుంటున్న దుర్గ కనీసం తలైనా ఎత్తకుండా అంది.

"హూఁ" అని కోపంతో మసిగుడ్డని చిత్తుగా నేలకేసి కొట్టాడు-ఆ తర్వాత కోపం తెచ్చుకున్నా బాధపడవలసింది తనేనన్న గత ఆరుసంవత్సరాల అనుభవాన్ని పురస్కరించుకుని మెల్లగా, "ఎందుకు పిలిచావ్?" అడిగాడు పెదభద్రయ్య.

"ఈమధ్య అన్నం చిముడుతోంది, కాస్త పదునుగానే వార్పెట్టు" మృదువుగానే శాసించింది దుర్గ.

"కాసేపా అల్లిక ఆపి నువ్వే వచ్చి వార్పెట్ట కూడదూ!" ఎలా ఓలా నాలుక తడిచేసుకున్నాడు భద్రయ్య. "ఇదిగో నాన్నా" అంటూ మసిగుడ్డ తీసి పదిలంగా అందించాడు చినభద్రయ్య.

"ఛీ ఛీ. వెధవబ్రతుకు! ఒక్కపట్టున కూర్చుని లెక్క నాలుగువరసలైనా అల్లికవేసుకోవడానికి తీరిచావదు" అంటూ విసురుగా అల్లిక సరంజామా డ్రాయరుమీదుంచేసి లేవబోయింది దుర్గ.

దుర్గలా బ్రతుకుమీద కోపగించుకుని, ఇష్టం లేని పని మొదలుపెడితే, వాటిల్లగల అనర్థాలు, సంభవించగల ముప్పులు క్షుణ్ణంగా ఎరిగున్నవాడైన పెదభద్రయ్య—

"పోనీలే, అల్లుకో. ఏదో మాటవరసకన్నాను, పదునుచూచే వార్పెడతాలే" అంటూ పిల్లిలా నిష్క్రమించాడు.

'వెధవా! నీకు సిగ్గు బొత్తిగా లేకుండాపోయింది. అభిమానాన్ని అంతగా చంపుకున్నావేం?' ఈ అంతరాత్మ తిరుగుబాటు ఎప్పుడూ ఉన్నదే కనుక అంతగా ఖాతరుచెయ్యలేదు.

చదువుకునేరోజుల్లో ఆడపిల్లల వెనక బెంచీల్లో చోటు దొరకదేమోనని గంటముందుగానే వచ్చి ఆక్రమించుకుని సర్వకాల సర్వావస్థల్లో, కాలేజీ గ్రౌండ్సులో అనంతమైన కీర్తిచే ప్రకాశించిన భద్రయ్య గతం తలపులోకివచ్చి ఏడుస్తూ అన్నం వార్చుతూ చచ్చిన తలిదండ్రుల్ని కూడా తలుచుకుని, మరి కాస్త ఏడ్వబోయి "ఏంలాభంలే ఏడ్చినా" అనుకుని గుటుక్కున దిగమింగేశాడు. అభ్యుదయ పథాన, సమత్వపు సహజత్వమే మోలే ఇది, అన్న సంతృప్తితో హృదయాన్ని జోకొట్టడానికలవాటు పడ్డ భద్రయ్య ఈసారీ అలానే చేశాడు.

కాలచక్రం గిర్రున తిరిగిపోగా పెద భద్రయ్య నల్లటి బుంగమీసాలు తెల్లబడి చిన భద్రయ్య పద్దెనిమిదేళ్ళవాడై కాలేజీలో చేరాడు. ఆ తర్వాత మరోసంవత్సరానికి అమ్మదగ్గర చెప్పే ధైర్యంలేక నాన్నదగ్గర చాటుగా క్లాసుమేటు వెంకటలక్ష్మిమీద తనకిగల ప్రేమని బహిరంగప్రకటన కావించేడు.

నెత్తిమీద పిడుగు పడ్డట్టయిన పెద భద్రయ్య ఓ క్షణంలో జీవిత సింహావలోకనం గావించుకుని కొడుక్కి పొడుగుజుత్తు చూపెడుతూ "నాయనా దీనిపై నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు వాత్సల్యం ఉట్టిపడుతూండగా.

చినభద్రయ్యేమీ మాట్లాడలేదర్థంకాక.

"చూడు నాయనా. అనేక ఫలితాలనిది అనుభవించి ఉంటుంది. అందుకే సలహాల నివ్వగలశక్తిని పొందుతుంది. దీని జీవితం నాశనమయినందుకు, అంతగా విచారపడకు నాయనా. దీని సలహాల నాచరించి బాగుపడే వాడొక్కడున్నా చాలు సార్థకత చేకూరిందని సంతోషిస్తుంది."

"ఏవిటో నాన్నా తిన్నగా చెప్పు" అన్నాడు చినభద్రయ్య, అయోమయంగా చూస్తూ.

"మరేంలేదు బాబూ! నా జీవితంలా నీ జీవితం కాకుండా ఉంటే అంతేచాలు, ఈ జన్మకి నేకోరుకునేదదే. నీకు తండ్రినైనందుకు, నా యందు విశ్వాసముంచి ఒక్క వాగ్దానం చెయ్యి. నీకై నువ్వు ఎవర్నీ చేసుకోడానికి నిశ్చయించుకోబోకు. నీ కాబోయే భార్యని నిర్ణయించడానికి ఈ నిర్భాగ్యుడికి అధికారం ఇయ్యి నాయనా. ఈ వాగ్దానమే నీనుంచి కోరేది" కొడుకు కండ్లల్లోకి చూస్తూ గంభీరంగా అన్నాడు. ఆ పితృమూర్తి చూపులలో ఏ అమరసందేశాలు గోచరించాయో ఏమోగాని కొన్ని క్షణాలపాటు అలా మౌనంగానే ఉండిపోయాడు చినభద్రయ్య.

చివరకి నెమ్మదిగా అన్నాడు—

"అలాగే నాన్నా వాగ్దానం చేస్తున్నా నీకిష్టమొచ్చిన పిల్లనే, చేసుకుంటా" అని.

"నా జీవితానికిప్పుడు సార్థక్యత చేకూరింది బాబూ" అంటూ సంతృప్తిగా నిట్టూర్చాడు పెదభద్రయ్య, మహిళామండలి వార్షికసభకి అధ్యక్షత వహించడానికి హడావుడిగా బయలు దేరుతున్న శ్రీమతి దుర్గమ్మని చూస్తూ.

---

స్కెచ్

# అంతస్తుల అంచనాలు

"పేపర్ బోయ్"

పబ్లిక్ గార్డెన్స్‌లో ఓ బెంచీమీద కూచొని ఎదుట ఉన్న సరస్సులో ఒడ్డున తేటనీళ్ళలోని అటూఇటూ కదిలిపోయే చేపల్ని-చిన్నవీ పెద్దవీ, చూస్తూ కూచున్నాను కాస్సేపుదాకా. పొద్దున్నుండీ కూడు లేదు. బాగా ఆకలవడంచేత అణా పెట్టి "పల్లీలు" కొని తినేసి, పొద్దు క్రుంకేవరకూ పురస్తుకుంటో కడుపునిండా నీళ్ళు తాగుదామని నల్లావేపు వెళ్ళాను. అంతవరకూ పొదమాటున కాచుకూర్చొని ఉన్నాడేమో, జుత్తురేగి, చిరిగిపోయిన మలిన దుస్తులతో ఓ కుర్రాడు గబగబా నే కూచున్న బెంచీచేరి ఏమిటో వెదకడం మొదలుపెట్టాడు. ఆ ఏరేవి తప్పక నే తింటూండగా చెదిరిపడిన గింజలో, ఏమరుపాటున పడిపోయిన కాయలో అయుంటాయి. నా మనస్సు కలుక్కుమంది. ఆ కుర్రాడిమీద జాలివేసింది. నేనే 'నా' అనేదీ, 'నా' అనేవాళ్ళూ లేని దౌర్భాగ్యుణ్ణీ, దీనుణ్ణీ అనుకున్నాను అంతవరకూ. నా తరువాతి అంతస్తు కూడా ఉందన్నమాట! ప్రపంచంలో ఎన్ని అంతస్తులో!

ఆకాశంలో ఎన్నో గాలి పడగలు ఎగురుతున్నాయి. అన్నీ ఒకే స్థాయిలో ఎగురుతున్నాయా? కొన్ని కనిపించీ కనిపించనంతటి దూరంలో నీల వర్ణంలో కలిసిపోయేంతవరకూ ప్రాకి యెగురుతున్నాయి. (అయితే ఇంకా పైకి ఎగరాలనే తహతహ చావలేదు) కొన్ని మరీ పైకి ఎగరలేకో, క్రిందికిరావడం ఇష్టంలేకో గిలగిలలాడుతున్నాయి. ఇంకా కొన్ని అత్యున్నతానికి ఎగబ్రాకి మధ్య తెగిపోయి నేల రాలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక సామ్యం లేని దెక్కడ?

"అమ్మగోరూ! ఇయ్యాలయినా డబ్బు లిప్పించండి. గేదెకి గడ్డీ, తవుడూ అవీ కొనుక్కోవాలి."

"అయ్యో! వారివ్వాళ పెందరాళే ఆఫీసుకు వెళ్ళిపోయారమ్మా, రేపు రామ్మా."

పాలవ్వ రుసరుసలాడుకుంటూ వెళ్ళిపోయింది. ఐనప్పటికీ రోజూ పాలుపోసే ఈ పాలవ్వ రెండు నెలల డబ్బులివ్వని ఎన్జీవోనిసైతం తనకంటే అదృష్టవంతు డనుకొంటుంది. కాని ఏడు గంటలదాకా ఆఫీసులో దించిన తల ఎత్తకుండా యంత్రంలా పనిచేసి బైటపడి, ఇల్లాలిని ఒక్కసారి తలచుకొని, (అక్కడ ఇల్లాలు గుమ్మంలో పసిపాపని ఒళ్ళో పెట్టుకొని 'దేహీ' అంటూ అరుస్తోన్న పచ్చి బాలింతని 'వేళాపాళా లేకుండా ఒకటే జోరీగ రొద" అని విసుక్కుంటోంది) డొక్క జానెడు పీక్కుపోగా కాళ్ళీడ్చుకుంటూ, రంగురంగు దీపాల వెలుగులో అంతంత ఎత్తుమేడల క్రిందుగా సరసనే హోటల్లోని గ్లాసుసామాను చప్పుళ్ళూ తదితర రొద వింటూ, చూస్తూ, తూలుతూన్నట్లు నడిచి వచ్చే ఎన్జీవో బాధ, పాలవ్వ ఏమాత్రం అర్థం చేసు